

కార్మికుల చట్టాలను కుదించడం దుర్మార్గం

కడప అర్బన్ : కార్మికుల చట్టాలను కుదించడం దు ర్మార్గమని సిఐటియు కడప జిల్లా ప్రధాన కార్యదర్శి మనో హర్ పేర్కొన్నారు. కార్మి కుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5వ తేదీ నిర్వహించే చలో ఢిల్లీకి జిల్లా నుంచి 150 మంది హాజరవుతామని పేర్కొన్నారు. ఆదివారం విజయ వాడలో నిర్వహించిన సిఐటియు రాష్ట్ర కమిటీ సమావేశంలో జిల్లా రిపోర్టును సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సి ంగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపకపోతే పోరాటాలు తప్పవని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



కడప జిల్లా రిపోర్టును తెలియజేస్తున్న మనోహర్

అన్ని గ్రామాలకు రోడ్ల కల్పనే లక్ష్యం

జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి వి.సురేష్ కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో అన్ని గ్రామాలలో రోడ్లను వేయించడమే తమ లక్ష్యమని జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి వి . సురేష్ కుమార్ పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాలో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, భవనాలను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటి వరకు ఏయే ప్రాంతాల్లో రోడ్లు వేశారు. ఇంకా ఎన్ని ప్రతిపాదనలో ఉన్నాయి.. అందుకు మంజూరైన నిధులు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల పనులు వంటి వాటి గురించి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.



ముఖా ముఖి..

జిల్లాలో ఇఇ, డిఇ, ఎఇల వివరాలు తెలపగలరు?

జిల్లావ్యాప్తంగా ఇఇలు రాయచోటి, మదనపల్లె, రాజంపేటలో ఉన్నారు. డిఇలు రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లెలో ఉన్నారు. ప్రాజెక్టు డిఇలు రాయచోటి , రాజంపేట, మదనపల్లె, తంబళ్లపల్లెఓ ఉన్నారు. మండలానికి ఒకరు చొప్పున 30 మంది, ప్రాజెక్టు ఎఇలు నలుగురు ఉన్నారు.

జిల్లాలో సచివాలయం ఎన్ని మంజూరయ్యాయి?, ఎన్ని పూర్తయినాయి

జిల్లా వ్యాప్తంగా 397 సచివాలయాలు మంజూరయ్యాయి. ఒక సచివా లయానికి రూ. 40 లక్షల బడ్జెట్‌తో మంజూరు చేశారు. ఇప్పటివరకు 254 సచివాలయాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశలలో పనులు జరుగుతున్నాయి.

రైతు భరోసా కేంద్రాలు ఎన్ని మంజూరయ్యాయి ?ఎన్ని పూర్తి చేశారు?

జిల్లా వ్యాప్తంగా రైతుబంధు కేంద్రాలు 386 మంజూరయ్యాయి. ఇప్పటివరకు 181 పూర్తయ్యాయి. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.21. 80 లక్షల అంచనాతో మంజూరయ్యాయి. మిగిలిన రైతు భరోసా కేంద్రాలు వివిధ దశలలో పనులు జరుగుతున్నాయి. విలేజ్ హెల్త్ క్లీనిక్ 297 మంజూరయ్యాయి. ఒక్కో క్లీనిక్‌కు 17.50 లక్షలు కేటాయించారు. ఇప్పటి వరకూ 95 పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

గడపగడపకు మన ప్రభుత్వం పనులు వివరాలు తెలపండి?

జిజిఎంపిలో భాగంగా జిల్లాలో 574 రోడ్లకు రూ. 1348. 73 లక్షలు కేటాయించారు. రాయచోటి డివిజన్‌లో రూ. 317 . 70 లక్షలతో 120 రోడ్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు జిల్లాలో 110 పూర్తయ్యాయి. రాజంపేట డివిజన్ లో రూ. 469.70 లక్షలతో 167 రోడ్లు మంజూ రయ్యాయి. 30 పూర్తయ్యాయి. మదనపల్లి డివిజన్‌లో 292 రోడ్లకు రూ. 561.33 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటివరకు 43 రోడ్లు వేశాం. మిగిలినవి కూడా పనులు జరుగుతున్నాయి . జిల్లాలో గృహ నిర్మాణ శాఖ లే అవుట్ల ఆర్చీలు పనులు చేపడుతున్నాం. 20 అడుగుల రోడ్డురూ. 4.15 లక్షలు , 30 అడుగులు రోడ్డు రూ 4.50 లక్షలు రూపాయలతో ఆర్చీలు చేపట్టడానికి చర్యలు తీసుకున్నాం.

సాహితీ శిఖరి 'భూతపురి'

- వైవీయూ విసి ఆచార్య జి.రంగజనార్ధన

ప్రజాశక్తి - కడప అర్బన్

బాల్యంలోనే సాహిత్య వ్యాసంగానికి శ్రీకారం చుట్టి అనేక అవధానాలు చేయడంతోపాటు చారిత్రక, పౌరాణిక కావ్యాలు, నాటకాలు, వ్యాఖ్యానాలు రచించిన సాహితీ శిఖరి, అవధాన కేసరి డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి ఆచార్య జి.రంగ జనార్ధన అన్నారు. డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం సంయుక్తంగా ఆదివారం ఉదయం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ 86వ జయంతి, 21వ స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి భూతపురి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ సాహితీకృషి విశిష్టమైందని, ఆయన 1953లో కవిగా సాహితీరంగంలో అడుగుపెట్టి 2002 వరకు అంటే దాదాపు అయిదు దశాబ్దాలపాటు తనదైన విలక్షణతతో సాహితీసేవ చేశారన్నారు. ఆయన ప్రాచీన మహాకవుల బాటలో ప్రయాణించి, సంస్కృతాంధ్ర భాషల్లో ప్రావీణ్యం సంపాదించి, పలు శతావధానాలు, అష్టావధానాలు చేశారని, ఆయన సాహితీకృషికి తార్కాణంగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్, గండపెండేర, గజారోహణాది గొప్ప సత్కారాలు అందుకున్నారని చెప్పారు. సభాధ్యక్షులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ కడప జిల్లా సాహిత్యానికి పుట్టినిల్లని, భూతపురి వంటి మహాకవులు ఈ గడ్డపై పుట్టారన్నారు. ఆధునిక సమాజానికి ఆవసరమైన మానవ విలువలు చోటుచేసుకునేలా భూతపురి, భూమయ్య కావ్యరచనలు సాగించారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ భూతపురి రాసిన కృష్ణభారత కావ్యం సాహిత్య చరిత్రలో ప్రత్యేకించి చారిత్రక కావ్యప్రక్రియలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుందన్నారు. తెలంగాణా విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ సిహెచ్.లక్ష్మణ చక్రవర్తి మాట్లాడుతూ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ సంస్కృతాంధ్ర భాషల్లో రచనలు చేసిన ధీశాలి అని, అందువల్లనే ఆయనను ఉభయ కవిసార్వభౌములుగా కవి పండితులు కీర్తించారన్నారు. సాహితీ సమరాంగణ ఆత్మీయ అతిథి, రిటైర్డ్ తెలుగు ఉపన్యాసకులు విద్వాన్ సమ్మెట శివశంకర్ మాట్లాడుతూ భూతపురి సుబ్రహ్మణ్యశర్మకు శ్రీకృష్ణదేవరాయలంటే అచంచలమైన గౌరవాభిమానాలు ఉం డడంతో ఎంతో కృషిచేసి కృష్ణభారతమనే మహాకావ్యాన్ని సృష్టి చేశారన్నారు. కార్యక్రమంలో పుత్తా పుల్లారెడ్డి, డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, జానమద్ది విజయ భాస్కర్, జానమద్ది నాగరాజు, అలపర్తి పిచ్చయ్య చౌదరి, గోపాల్, డాక్టర్ శేషాద్రి, కొండూరు జనార్ధన రాజు, పాలగిరి విశ్వప్రసాద్, డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, గానుగపెంట హనుమంతరావు, కొత్తపల్లె రామాంజనేయులు వంటి సాహి తీవేత్తలు, సాహితీ ప్రియులు, భూతపురి ఆత్మీయులు పలువురు పాల్గొన్నారు.



ఆచార్య భూపయ్యకు పురస్కారం అందజేస్తున్న అతిథులు

కమనీయం శ్రీ కామాక్షి త్రేతేశ్వర స్వామి కల్యాణం

పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మేడా దంపతులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అత్తిరాలలో వెలసిన శ్రీ కామాక్షిత్రేతేశ్వర స్వామికి ఆదివారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున్‌రెడ్డి సతీ సమేతంగా పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే స్వయంగా తీసకొచ్చిన ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. అనంతరం సతిసమేతంగా స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కామాక్షిత్రేతేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ వి.వెంకట సుబ్బారెడ్డి, రాజంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పోలి సుబ్బారెడ్డి, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మందరం వేణుగోపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు మందరం గంగిరెడ్డి, వజ్ర శేఖర్ రెడ్డి, కమలేశ్వరరావు, ప్రభుత్వాసుపత్రి డైరెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, పాలగిరి మల్లికార్జున్ రెడ్డి, సత్యాల రామకృష్ణ, కొరముట్ల హరి, మలిశెట్టి శ్రీరాములు పాల్గొన్నారు.


పట్టుచీర, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న మేడా మల్లికార్జునరెడ్డి దంపతులు

ఆహార ధాన్యాలను పునరుద్ధరించాలి

24న కలెక్టరేట్ ఎదుట ధర్నా
సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి కడప అర్బన్

1952 నుంచి పేదలకు దేశంలో రేషన్ కార్డు దారులకు ఇస్తున్న ఐదు కిలోల ఉచిత ఆహారధాన్యాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ నుంచి నిలిపేసిందని వెంటనే పునరుద్ధరించాలని సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక వార్షిక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో ఔషధాలపై, ఆహార ధాన్యాలపై, నిత్యవసర వస్తువులపై జిఎస్‌టిని పెంచారని, వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి, ఎస్‌బిఐలలో ప్రజలు కూడబెట్టుకున్న సొమ్మును స్టాక్ మార్కెట్ జూదంలో పెట్టడాన్ని కేంద్ర ప్రభుత్వ విధానం మార్చుకోవాలన్నారు. ప్రజల నిత్యావసర వస్తువులపై జిఎస్‌టి ఉపసంహరించాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలి రేట్లు పెంచాలని, కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల జీవనోపాధిపై నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం విదేశీ, స్వదేశీ క్రోని క్యాప్టలిస్టుల ప్రయోజనాల కోసమే దేశ ప్రజలపై పన్నుల భారం వేస్తున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలు, ఆస్తి పన్ను, గ్యాస్ ధరల పెంపు యూజర్ చార్జీల పేరుతో ప్రజలపై మోయరాని భారాన్ని మోపుతోందన్నారు. ఆదాని, అంబానీ లాంటి 116 మందికి శతకోటేశ్వర్లకు రూ.11 లక్షల కోట్ల రాయితీలు ఇచ్చారన్నారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 24న ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో కడప జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ మోహన్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, సిపిఎం నగర కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కడప జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

నేడు ప్రజాఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నకారణంగా భారత ఎన్నికల సంఘం అనుమతి మేరకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లో యథావిధిగా నిర్వ హించనున్నట్లు కలెక్టర్ పిఎస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంట లకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహి స్తామన్నారు. అందుకు సంబంధించి ఎస్ఎల్ఏ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అడవి పల్లెలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని అడిపల్లె సమీపంలోని శ్రీమద్గుండాల మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తలుపుల ప్రాథమిక ఆరోగ్య డాక్టర్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో శివరాత్రి పండుగ సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఎండకు వడదెబ్బకు గురికాకుండా నీడపాటున సేదదీరాలని పేర్కొన్నారు. స్వచ్ఛమైన తాగునీటినే తాగాలన్నారు. పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు ఫామున్నిసా, నాగవేణి, వెంకటరత్నం, గూడరేవుపల్లి, తలుపుల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం పొందాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులకు విద్యతో పాటు క్రీడారంగంలోనూ మంచి ప్రావీణ్యత అవసరమని కళాశాల కార్యదర్శి, క రెస్పాండెంట్ ఎస్. రామ్మోహన్ రెడ్డి, ప్రెసిడెంట్ ఎం. నాగమల్లారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె. సతీష్ బాబు తెలిపారు. జెఎన్‌టియు క్రికెట్ టీం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ ఫరూక్ అహ్మద్ కోచింగ్ క్యాంప్ కరస్పాండెంట్, మోసెస్ ప్రవీణ్ ఆటగాళ్లకు శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఈ 16 మంది ఆటగాళ్లకు పోటీలో బాగా ఆడి గెలవాలని పిలుపునిచ్చారు. క్రికెట్ టీంలో ఎంపికైన వారు ఈనెల 20న కర్ణాటకలో ఉండే బెంగళూరు రేవా యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, ఇతర విభాగాల హెచ్‌ఓడి పాల్గొన్నారు.



క్రికెట్ టీమ్‌కు ఎంపికైన విద్యార్థులు

నాయీ బ్రాహ్మణ కృతజ్ఞతా సభ కరపత్రాలు ఆవిష్కరణ

కడప : రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య ఆధ్వర్యంలో విజయవాడ కేంద్ర కార్యాలయంలో నిర్వ హించబోయే నాయి బ్రాహ్మణ కృతజ్ఞత సభ కరపత్రాలను ఆదివారం కడపలోని వైసిపి జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు క్యాంప్ కార్యాల యంలో మాజీ మంత్రి రామ సుబ్బారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న తహశీల్దార్

పెండ్లిమర్రి : మండలంలోని పొలతల మల్లేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన కర్నూలు జిల్లా బేతంచెర్లకు చెందిన చాకలి లక్ష్మీదేవి మహిళ ఆదివారం మృతి చెందారు. మృతదేహాన్ని ఆమె స్వగ్రామానికి తీసుకు వెళ్లడానికి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడు తుండడంతో గమనించిన తహశీల్దార్ ఉద యభాస్కర్‌రాజు స్వయంగా రంగంలోకి దిగి మాన వత్వం చాటుకున్నారు. తహశీల్దార్ వెంటనే అంబులెన్స్ పిలిపించి తానే స్వయంగా మృతదేహాన్ని అందులో ఎక్కించారు. అంత్యక్రియలు, ఇతర ఖర్చుల కోసం రూ. 15 వేల ఆర్థిక సాయం చేశారు.

ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

కాశినాయన : నర్సాపురంలో ఆదివారం చత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టిడిపి జిలాల మహిళా అధ్యక్షురాలు కర్నాటి శ్వేతారెడ్డి, నాయకులు వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటాన్ని గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.వి.సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ నాగేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

కడప అర్బన్ : నగరంలోని శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మిస్సా మూవీస్ పద్మాకర్ ఆధ్వర్యంలో రాయచోటికి చెందిన డీజె మణి అకాడమీ జానపద శాస్త్రీయ నృత్యాలు చేశారు. నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి శివ పసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

పీడిత ప్రజల హక్కుల కోసం పోరాటం

ప్రజాశక్తి - రాయచోటి

అమరవీరుల స్ఫూర్తితో, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ పీడిత ప్రజల హక్కుల కోసం పౌరహక్కుల సంఘం పోరా డుతూనే ఉంటుందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షులు రెడయ్య పేర్కొన్నారు. అమర వీరుల చిత్రాలతో రూపొ ందించిన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక మున్సి పల్ కార్యాలయం ఆవరణలో కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 197 లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా ఉద్యమాలపైనా, ఉద్యమ కారులపైనా ఆనాటి జలగం వెంగళరావు ప్రభుత్వం అమలు చేసిన క్రూర నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాపితంగా ప్రజాస్వామిక వాదులు, మేధావులు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారన్నారు. రాజ్యహింసను ప్రశ్నిస్తూ, ఉద్యమ కారుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ, భూటకపు ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా 1973 డిసెంబర్ 23న గుంటూరులో ప్రజా కవి శ్రీశ్రీ అధ్యక్షతన ఆంధ్ర ప్రదేశ్ పౌర హక్కుల సం ఘం ఏర్పడిందని చెప్పారు. ఎవ్వరి హక్కుల కోసం మరెవ్వరూ గొంతెతరో, అలాంటి వారి హక్కులకో సం పోరాడుతుందని పౌర హక్కుల సంఘమ న్నారు. పోలీసులు చట్ట వ్యతిరేకంగా చేస్తున్న లాక ప్ మరణాలు, భూటకపు ఎన్కౌంటర్లు నిజ నిర్ధార ణలు చేసి వాస్తవాలను ప్రజల ముందు పెట్టా లన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.నాగేశ్వర్ రావు, సహాయ కార్యదర్శి ఎం. రవిశంకర్, కోశాదికారి వంగిమల్ల రమణ, చైతన్య మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ఝాన్సీ లక్ష్మి, శ్రీనాథ్ రెడ్డి, హరినాధ, రైతు నాయకులు రంగారెడ్డి, పల్లం తాతయ్య పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

అన్ని సదుపాయాలతో యుఎస్ ఫంక్షన్ హాల్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ప్రజ లకు అన్ని సదు పాయాల తో యుఎస్ మహల్ (ఉస్మాన్ ఫంక్షన్ హాల్) నిర్మించడం శుభ పరి ణామమని ఉపము ఖ్యమంత్రి అంజాద్ బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి, నగర్ మేయర్ సురేష్ బాబు అన్నారు. ఆదివారం రవీంద్ర నగర్ లోని ఎన్ఆర్ఐ సయ్యద్ ఉస్మాన్ బాషా నూతనంగా నిర్మించిన యూఎస్ మహల్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర ప్రజలకు పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు సువిశాలమైన గదులతో నిర్మించడం చాలా ఆనందదాయకమన్నారు. అనంతరం యుఎస్ మహల్ అధినేత సయ్యద్ ఉస్మాన్ బాషా మాట్లాడుతూ మా ఫంక్షన్ హాల్‌లో సెంట్రల్ ఏసి, స్త్రీలు, పురుషులకు విడివిడిగా గదులు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్య అతిథులకు డైనింగ్ హాల్ స్త్రీలకు ప్రత్యేక డైనింగ్ హాల్ కలదన్నారు. పార్కింగ్ సౌకర్యంతో సరికొత్త హంగులతో అన్ని వసతులతో ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ముఖ్య అతిథులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎపిఎన్ఆర్‌టిఎస్ డైరెక్టర్ బి.హెచ్ ఇలియాస్, ఎన్ఆర్ఐ గ్రూప్స్ ముమ్మడి బాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పాకా సురేష్, వైసిపి సీనియర్ నాయకులు మాసిమా బాబు, ఉమేర్ జువెలర్స్ అల్లా బకాష్, డాక్టర్ సోహెల్, వైసిపి నాయకులు జయరెడ్డి, నారపరెడ్డి సుబ్బారెడ్డి, కాల్ టెక్స్ ఆఫీ జుల్లా, రామకృష్ణారెడ్డి, జమాల్ వల్లి, కార్పొరేటర్లు షఫీ, బాలస్వామి రెడ్డి, షంషీర్, తోట కృష్ణ, ఎన్ఆర్ఐ గ్రూప్స్ మిత్రబృందం, మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.


ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

గంగమ్మ జాతరలో విషాదం

- చాందిని బండి కింద పడి పులివెందుల జడ్‌పిటిసి మహేష్‌రెడ్డి మృతి
- కుటుంబ సభ్యుల్ని పరామర్శించిన వైసిపి నాయకులు
- శోక సముద్రంలో కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ఆర్.తుమ్మలపల్లి గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరలోవిషాదం చోటు చేసుకుంది. చాందిని బండి కిందపడి పులివెందుల జడ్‌పిటిసి తుమ్మల మహేశ్వర్ రెడ్డి (48) మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. ఏటా తుమ్మలపల్లి గ్రామ సమీపంలో చింతల గంగమ్మ ఆలయంలో శివరాత్రి పర్వదినం మరుసటి రోజున గ్రామస్తులు జాతరను నిర్వహిస్తారు. ఈ ఏడాదీ పండగ తర్వాత ఆదివారం నిర్వహించారు. అందులో భాగంగానే చాందిని బండిని కట్టి గ్రామ పొలిమేర మీద గంగమ్మ ఆలయం వద్దకు తీసుకొస్తారు. అలా తీసుకొస్తున్న సమయంలో బండిపై ముందుభాగంలో కూర్చొన్న జడ్‌పిటిసి ప్రమాద వశాత్తు కిందపడ్డాడు. వెంటనే స్థానికులు అతన్ని వాహనంలో పులివెందుల ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. దీంతో మహేష్‌రెడ్డి కుటుంబంలో, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య ఉమా, కుమారుడు, హేమంత్‌రెడ్డి, కుమార్తె హేమలత ఉన్నారు. కుమారుడు యుఎస్‌ఎలో ఎంఎస్‌సి పూర్తి చేశారు. పండుగ చూసుకుని ఉద్యోగం కోసం తిరిగి యుఎస్‌ఎకు వెళ్దామనుకునే లోపు తండ్రి ఇలా ప్రమాదంలో మృతిచెందడంతో బోరున విలపించారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి పులివెందుల నియోజవర్గ ఇన్‌ఛార్జి వై.ఎస్. భాస్కర్‌రెడ్డి, తొండూరు మండల ఇన్‌ఛార్జి మధు, నాయకులు ఏరియా ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మహేశ్వర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. సర్పంచ్‌గా పనిచేసే మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు పార్టీలలో క్రియాశీలకంగా వ్యవహరి స్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్‌పిటిసిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. అర్బన్ సిఐ రాజు, ఎస్ఐ స్వామీ, ఏరియా ఆసుపత్రికి తరలివచ్చి సంఘటనపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.


ప్రమాదంలో మృతిచెందిన జడ్‌పిటిసి, మహేష్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

వేమన పద్యపోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-కలికిరి

వేమన పద్య పోటీల విజేతలకు రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. పద్యాలు, రచనలు, నృత్య కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ తృతీయ బహుమతులు, ప్రశంసా పత్రాలు, నగదుతో మొమెంటోలు బహూకరించారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సమాజాన్ని నీతి పద్యాలు ఎంతగానో ప్రభావితం చేస్తాయని, లోకజ్ఞానం వంటి మానవీయ విలువల్ని నేర్పిస్తాయన్నారు. తెలుగు సాహితీవేత్త పూర్వపు పాలక మండలి సభ్యులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్, సామాజిక సేవా సంస్థల వి.బ్రహ్మానంద రెడ్డి, ప్రముఖ కవి మురళీధర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు సహకారదారులు రాంప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి సురభి, కంటి వైద్యశాల అధినేత రెడ్డివారి భాస్కర్ రెడ్డి, గౌరవాధ్యక్షులు ఆది పబ్లిక్ స్కూల్ అధినేత ఆదినారాయణ రెడ్డి, బిల్డర్ శేషు కుమార్ రెడ్డి, క్రాస్ రోడ్ మధు రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకట నారాయణ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తాతి రెడ్డి, చేపల రాజారెడ్డి, రాజువారిపల్లి రాజారెడ్డి, సుధాకర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్నికైన దళిత మిత్ర నూతన కమిటీ సభ్యులు

దళిత మిత్ర సంఘం మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గాలివీడు

ఎపి దళితమిత్ర సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు, రాష్ట్ర నాయకులు తలారి కులాయప్ప, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జ్ నాగేశ్వర, జిల్లా అధ్యక్షులు కరకోటి కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, కాన్షిరాం ఆలోచన విధానాలను అనుసరించి ప్రజలు చైతన్య వంతులను చేయాలన్నారు. మండల అధ్యక్షులు మండే ఆనంద్, ఉపాధ్యక్షులు హరి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వీరశేఖర్, ప్రధాన కార్యదర్శి భద్రయ్య, ప్రచార కార్యదర్శి ఓబులేసు, కోశాధికారి రాజన్న, కార్యదర్శి శ్రీనివాస్ నాయుడు, అధికార ప్రతినిధి జయరామ్, కార్యవర్గ సభ్యులు గంగాధర, ప్రభాకర్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కిషోర్‌బాబు, ఉపాధ్యక్షులు వీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి మధుసూదన్, చిన్న మండల అధ్యక్షులు నరసింహ, ఉపాధ్యక్షులు శంకరయ్య ప్రధాన కార్యదర్శి చిన్న కులాయప్ప, ప్రచారకార్యదర్శి ఆదినారాయణ, లోకేష్ పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న 'సుగవాసి'

ప్రజాశక్తి-చిన్నమండ్యం

మండల పరిధిలోని దేవగుడిపల్లి గ్రామంలో మాలి పెద్దయ్య స్వామి జాతరలో కురవపల్లి గ్రామస్తుల ఆహ్వానం మేరకు నియోజకవర్గ టిడిపి నాయకుడు సుగవాసి ప్రసాదబాబు పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత ఆయనను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కరుణాకర్, వెంకట రమణ, పెద్దయ్య, పురుషోత్తం, పెద్దయ్య, నాగరాజా, శ్రీనివాసులు, అంజి, శంకర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి : ఎమ్మెల్యే

ముద్దనూరు : ప్రజలంతా సుఖ శాంతులతో సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నదుద్యాల, బొందలకుంట గ్రామంలో ఆదివారం నిర్వహించిన గంగమ్మ జాతరను కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ ఉమాదేవి, వైసిపి నాయకులు డాక్టర్ నవజ్యోతి, మండల యూత్ అధ్యక్షులు సుమంత్ యాదవ్, రమణ ట్రాన్స్‌పోర్టు అధినేత వెంకటరమణారెడ్డి, మౌనిక మిల్క్ డెయిరీ ఎండి శ్రీనివాసులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

ప్రజాశక్తి-కలికిరి

శివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని అన్ని శివాలయాల్లో శివ పార్వతుల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గుట్టపాలెం పంచాయతీ కె.బర్రేపల్లి పూలకొండలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఉదయం నుండే అభిషేకాలతో ప్రారంభమై మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఆలయ ధర్మకర్త బాల రెడ్డప్ప, వెంకట స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సోమేశ్వరాలయం, మేడుకుర్తి కస్పా లో ఉన్న అగస్త్యేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రెండు రోజులపాటు శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. **నిమ్మనపల్లి :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తవళం గ్రామంలోని యోగ నేలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద ఇఒ మంజుల, ప్రత్యేక పర్యవేక్షణ అధికారి రవికుమార్, మండల వైసిపి ఇన్‌ఛార్జ్ ఆర్‌ఇ రమణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం భక్తులకు ఏర్పాటు చేశారు. ఆదివారం పగటి తిరుణాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి సాయంకాలం వరకు భక్తులు వేల సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. మండల వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున అన్నసంతర్పణ వాహనాలను ఊరేగించారు. రెండు రోజులపాటు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద ఎస్ఐ ఫాతిమా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, నారాయణ, శంకర,గంగాధర, రవి, రవి, పాల్గొన్నారు. **పీలేరు :** మహాశివరాత్రి



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



భక్తులతో కిటకిటలాడిన నేలమల్లేశ్వర ఆలయం

పర్వదినాల సందర్భంగా శైవ క్షేత్రాలు సందర్శనతో కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీకాశీ విశాలాక్షి సమేత శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, దొడ్డిపల్లి పంచాయితీలోని శివరామపురంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం, తలుపుల పంచాయితీ, అడవిపల్లి సమీపంలోని శ్రీమద్గుండాల మల్లేశ్వవర స్వామి ఆలయాలు ప్రముఖ మైనవి. మహాశిరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి జాగరణ చేసిన భక్తులు ఆదివారం సూర్యోదయానికి ముందే ఝురి స్నానాలు ఆచరించి శివపార్వతుల దర్శనార్థం ఆలయాలకు చేరుకోవడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పీలేరు-మదనపల్లి మార్గంలోని శ్రీచెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలోని బడవళ్ళ వంకలో శ్రీకాశీ విశాలాక్షీ సమేత శ్రీకాశీ విశ్వేస్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు విరూపాక్షం కుమార్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన త్రిశూల స్నాన కార్యక్రమంలో వేదపండితులు వినయ్ సుహాస్, వినీత్ శర్మ, అనంత గౌతమ్, స్థానిక భక్తులు మోహన్ రెడ్డి, గోపాల్ సుమన్, శరత్, సుధాకర్, జయసింహా రెడ్డి, వెంకటష్, మల్లికార్జున, క్రుపాల్, రమణ హాజరయ్యారు. **మదనపల్లె అర్బన్:** మదనపల్లి మండలం కోళ్ళబైలు పంచాయితీ అమ్మ చెరువు మిట్ట నందుగల వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుతిని వెలుగు ప్రాంగణం నందు మంటపం ఏర్పాటు చేసి అందులో మహాశివుడు శివలింగాన్ని, సందేశర్వుని ఏర్పాటు చేశారు. పిల్లలు, వృద్ధులు శివారాదలో పాల్గొన్నారు. కన్వీనర్ భాగ్యాలక్ష్మి మహాశివ రాత్రి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రామ్ దేవ్ సీతా మందిరం వారు పిల్లలతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యాక్రమంలో ఎం. ఉదయ్‌మోహన్‌రెడ్డి, వెలుగు కన్వినర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి. లీనాకుమారి, రామ్‌దేవ్‌సేవా మందిరం సిబ్బంది, చిన్నారులు వృద్ధులు పాల్గొన్నారు.

ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్‌గా తవ్వా సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

వైఎస్ఆర్ కడప జిల్లా ఒలింపిక్ అసో సియేషన్ చైర్మన్‌గా తవ్వా సుధీర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ మేరకు కడప నగరంలోని ప్రెస్‌క్లబ్ లో ఆదివానం అన్వాల్ జన రల్ బాడీ సమావేశం, ఎన్నికలు నిర్వహిం చారు. ఎన్నికల పరిశీలకుడిగా శ్రీధర్, శాప్ చీఫ్ కోచ్ అమృత్‌రాజ్ పాల్గొన్నారు. మండలంలోని దుంపలగట్టు గ్రామానికి చెందిన సుధీర్‌రెడ్డిని రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలు వురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులుగా సమర్‌నాథ్‌రెడ్డి, సెక్రెటరీగా సునీల్, ట్రెజరీగా సాయికిషోర్‌ను ఎన్నుకున్నారు.

'దళిత మహిళల హక్కుల కోసం పోరాటం'

- నవ్యాంధ్ర మాల మహానాడు అధ్యక్షులు శరత్‌బాబు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దళిత మహిళల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తామని నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొర్రపాటి శరత్‌బాబు తెలిపారు. మండలంలోని గూడెంచెరువు గ్రామంలో ఆదివారం ఆయన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 50మంది మహిళలు నవ్యాంధ్ర మాల మహానాడులో సభ్యత్వం తీసుకున్నారు. వీరికి శరత్‌బాబు గుర్తింపు కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా గూడెంచెరువు గ్రామంలో దళితులకు శ్మశాన వాటిక లేదని, దీనిపై అధికారులతో మాట్లాడుతామని అన్నారు. పెత్తందార్ల దాడులకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి రాణి మాట్లాడుతూ మహిళల సమస్యల పట్ల ముందుండి పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి నవ్యాంధ్ర మాల మహానాడు మహిళా నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ప్రజలంతా ఉత్సవాలను ఉల్లాసంగా జరుపుకోవాలని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని పెదనపాడు గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి (శివాలయం) దేవాలయంలో మహా గాయత్రిదేవి ఉపా సకురాలు సద్గురు శంకరి అఘోరి మాతాజీ ఎండు మిరపకాయల మహా యజ్ఞాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భూపేష్‌రెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనువాసులరెడ్డి, రామ కృష్ణారెడ్డి, వెంకటరమణ, నిత్యవర్ధన్, గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

హోటళ్లు, మాంసం విక్రయదారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని హోటళ్లు, మాంసం విక్రయ సెంటర్లను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న పలు హోటళ్ల యజమానులకు జరిమానా విధించారు. మాంసం దుకాణాల వారు పశువైద్య అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని తప్పక తీసుకోవాలన్నారు. మాంసం ధరలు కూడా ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నిబంధనలు పాటించకపోతే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

నిరుపేదలకు అన్నదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

యునైటెడ్ ప్రవాస యాదవ్ కమ్యూనిటీ సాయంతో లక్ష్మీదేవి, నరసింహులు యాదవ్ కుమారుడు చెని నాగేంద్ర యాదవ్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జంగం ప్రాంతంలో ఉన్న నిరుపేదలకు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా ధనాన్ని వృథా కానివ్వకుండా నిరుపేదల ఆకలి తీర్చడం చాలా గొప్ప విషయమన్నారు. దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు పాలెం సంజీవ రాయుడు, గిరి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సమస్యలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలు సమస్యలకు నిలయాలుగా మారాయి. ఆ కాలనీలో కనీస సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదు. సిమెంటు రోడ్లు, విద్యుత్ సదుపాయం, తాగునీటి పైప్‌లైన్లు వంటి కనీస సదుపాయాలు అరకొరగానే ఉంటున్నాయి. మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామంలో గట్టుపైన జగనన్న కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కాలనీలో దాదాపు 250 పైబడి నివాసాలు మంజూరయ్యాయి. ఇప్పటికీ కాలనీలోని పలు వీధుల్లో సిమెంట్ రహదారులు లేవు. ఇళ్ల నిర్మాణం చేపట్టాలనుకొనే లబ్ధిదారులు వసతులు సమకూరకపోవడంతో ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జగనన్న కాలనీలో కనీస సదుపాయాలు కల్పించి సమస్యలను పరిష్కరిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పతనం : టిడిపి

పజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్

రాష్ట్రంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పతనమైందని కడప టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాల నీలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పర్యటనలో పోలీసుల తీరు సరిగా లేదన్నారు. పోలీసు అధికారులే ప్రభుత్వానికి తొత్తు లుగా వ్యవహరిస్తున్నారని, కిందిస్థాయి అధికారులు ఏం చేస్తారని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు పర్యటన లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడమే తన పనిగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పాద యాత్రలో మైకులు లాక్కో వడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయ కులకు హక్కు, స్వాతంత్ర్యం లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభు త్వంలో దళితులపై దాడి, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, చెత్త పన్ను, ఇంటి పన్ను, సామాన్యుల ఆర్థిక వనరులపై దాడులు, ఇసుక దందా, లిక్కర్ మాఫియా, భూదం దాలతో రాష్ట్రాన్ని కొల్లగొడుతు న్నార న్నారు. మాజీ కౌన్సిలర్ సీతారాంరెడ్డి, సానా విజయభా స్కర్‌రెడ్డి, లాయర్ సుబ్బయ్య, సుంకర వేణుగోపాల్, సిద్దయ్య, నాగేశ్వర రావు పాల్గొన్నారు..



ఇదేంఖర్మ కార్యక్రమంలో ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి

అరాచక పాలన పోవాలి : ఆర్ఆర్

ప్రజాశక్తి-గాలివీడు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, త్వరలోనే ఈ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడుతారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమం నూలివీడు పంచాయతీ పరిధిలోని బోడసానిపల్లె, శ్రీనివాసపురం, కొండ్రెడ్డిగారిపల్లె , కుమ్మరపల్లె, దళితవాడ, నల్లబత్తిన వాండ్ల పల్లె ,కొత్త బండిన వాండ్లపల్లె, నాగూర్ వాండ్ల పల్లెలలో నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు, వంటగ్యాస్, డీజిల్ , పెట్రోలు ధరలను అమాంతం పెంచిందని అన్నారు. ఆర్‌టిసి, విద్యుత్ చార్జీలు పెంచడం, ఇంటి పన్నులు భారీగా పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో టిడిపికి పూర్వవైభవం వస్తుందని, ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తారకరత్నకు పలువురి నివాళి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రముఖ సినీ నటుడు నందమూరి తారకరత్న చిత్రపటానికి నియోజక వర్గ టిడిపి నాయకుడు చామర్తి జగన్మోహన్ రాజుతో పలువురు టిడిపి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తారకరత్న నిబద్ధతగల వ్యక్తని, అటువంటి వ్యక్తి మరణించడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలి శివకుమార్, పరుశురాం నాయుడు, సూర్య నారాయణ రాజు, శేషారెడ్డి, సుధాకర్ రాజు, ఒంటిమిట్ట వినోద్ రెడ్డి, నాగేంద్ర, శ్రీను, రాజేష్ వర్మ, గురు నాయుడు, నన్నూరి లక్ష్మణ్, అమీర్ పాల్గొన్నారు.



జరి మహోత్సవానికి హాజరైన సందర్శకులు

వైభవంగా 'జరి' మహోత్సవం


ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ సమీపంలోని దేవళంపేటలో కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా దేవాలయానికి అనుసంధానంగా ఉన్న జరి మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జరి మహోత్సవానికి జిల్లా నుంచే కాకుండా కడప, చిత్తూరు, అనంతపురం, జిల్లాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవానికి భక్తులను చేరడానికి పీలేరు, మదనపల్లి డిపోల నుండి సుమారు 32 ఆర్‌టిసి బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కలకడ సిఐ నాగేంద్ర, ఎస్ఐ తిప్పేస్వామి, 30 మంది ఎన్‌సిసి విద్యార్థులతో కలసి భారీ సంఖ్యలో బందోబస్తు నిర్వహించారు.

జాతరకు వచ్చే భక్తులకు వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

జాతరకు వచ్చే సామాన్య భక్తులకు దర్శనం కల్పించేందుకు సిబ్బంది చొరవ చూపాలని మండల అధ్యక్షుడు అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, చైర్మన్ నరసింహారెడ్డి, ప్రత్యేక అధికారి రవీందర్ రాజులతో కలిసి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తుగా తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఇప్పటినుండి సరిచేసుకోవాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ లేకుండా నియంత్రించుకోవాలని పోలీసువారిని కోరారు. సామాన్య భక్తులకు క్యూలైన్ల ద్వారా అమ్మవారి దర్శనాన్ని కల్పించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న మిఠాయి అంగళ్ళు, చెరుకుల బండ్లు వంటి వ్యాపారస్తులకు ముందస్తుగా రోడ్డుపై లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మానవతా చైర్మన్ బాల సుబ్రహ్మణ్యం, శివ శంకర్‌రెడ్డి, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు లల్లు యాదవ్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి

క్రైం కార్నర్



మంటలను అదుపు చేస్తున్న పోలీసులు

గడ్డికి నిప్పు : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -కలకడ

ఎండిన గడ్డికి ఆకతాయిలు మంట పెట్టడంతో మంటలు చెలరేగాయి. పోలీసులు సకాలంలో స్పందించి మంటలను ఆదుపు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని దేవళంపేటలోని కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం అనుసంధానంగా నిర్వహిస్తున్న జరి మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో ఆకతాయిలు ధూమపానం సేవించడానికి అగ్గిపులను ఎండిన గడ్డిపై వేయడంతో మంటలు చెలరేగాయి. సకాలంలో స్పందించిన సిఐ నాగేంద్ర, ఎస్ఐ తిప్పేస్వామి, తన సిబ్బందితో భక్తులకు ఎలాంటి ప్రమాదం జరుగ కుండా మంటలను అదుపు చేశారు. దీంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఎవరైన ఆకతాయి చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. ఢచీశీఅవగమంటలను ఆర్పి భక్తులకు ఎలాంటి హాని, ప్రమాదం జరగకుండా అదుపు చేశారు.దీనితో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.